ప్రారంభానికి నోచుకోని పంచాయతీ భవనం

• బీఆర్ఎస్ హయాంలో రూ.13లక్షలు మంజూరు • మూడేండ్ల క్రితమే నిర్మాణం పూర్తి • ప్రత్యేకాధికారుల పాలనతో ఆటంకం

ప్రారంభానికి నోచుకోని తిర్మాపూర్ పంచాయతీ భవనం

నూతన భవన సమీపంలో చెత్తాచెదారం

పూడూరు, మే 21: గ్రామ పంచాయతీ భవనం నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. భవనానికి ఏర్పాటు చేసిన డోర్లు, కిటికీలు పాడవుతున్నాయి. నాయకులు, అధికారులు కొత్త భవన ప్రారంభంపై దృష్టి పెట్టకుండా పాత భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పూడూరు మండలం తిర్మలాపూర్ గ్రామ పంచాయతీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం సుమారుగా రూ.13లక్షలు మంజూరు చేసింది. దీంతో గత మూడు సంవత్సరాల క్రితమే నూతన భవన నిర్మాణపు పనులు పూర్తి చేశారు. కొంత కాలానికి సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలన తీసుకు వచ్చింది. దీంతో భవన ప్రారంభంపై నాయకులు దృష్టి పెట్టడం లేదు. నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ఆ భవనం పక్కనే చెత్త చెదారం దర్శనమిస్తున్నది. డంపింగ్ యార్డు ఉన్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల తెలిపారు. మండల పరిధిలోని చీలాపూర్ గ్రామ పంచాయతీ భవనం పనులు సైతం అర్ధంతరంగా నిర్మాణం మధ్యలోనే వదిలేశారు. లక్షల వ్యయంతో భవన నిర్మాణాలు చెపట్టి నిరుపయోగంగా ఉంచారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతి నిధులు, అధికారులు గ్రామ పంచాయతీ భవన ప్రారంభంపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెంటనే ప్రారంభించాలి

ప్రభుత్వం లక్షల నిధులు కేటాయించగా గ్రామ పంచాయతీ నూత న భవనం నిర్మించారు. ఆ భవనం ప్రారంభానికి నోచుకొక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నది. నూతన భవనం ప్రారంభం చేయకపోవడంతో సరైన సౌకర్యాలు లేని పాత భవనంలో అధికా రులు పనులు చేస్తున్నారు. గ్రామస్తులకు సౌకర్యవంతంగా ఉండేం దుకు గాను నిర్మించి సంవత్సరాల తరబడి ప్రారంభించకుండా వదిలేసిన నూతన భవనాన్ని నాయకులు, అధికారులు దృష్టి పెట్టి వెంటనే ప్రారంభించాలి.

– రామునాయక్, తిర్మలాపూర్ గ్రామం, పూడూరు

వరి కోతలకు అడ్డంకిగా వాన

- ధాన్యం ఆరబెట్టడానికి ఇబ్బందులు
- తమ పంట చేతికి వస్తుందా అని రైతుల ఆందోళన
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వినతి

సుల్తాన్‌పూర్‌లో వర్షం కారణంగా కోత నిలిచిన వరి పంట

పరిగి, మే 21: గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలు వరికోతలకు అడ్డంకిగా మారాయి. పరిగి మండల పరిధిలోని పలు గ్రామాలలో వరికోతలు చాలావరకు పూర్తి కావచ్చినా, కొన్ని గ్రామాలలో ఇప్పటికీ కోతలు చేపట్టాల్సి ఉన్నది. మండల పరిధిలోని పలు గ్రామాలలో గత ఆదివారం వరకు వరికోతలు పూర్తి కావచ్చాయి. కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిద్దామంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలావుండగా మండలంలోని చిగురాల్‌పల్లి, గోవిందాపూర్, మిట్టకోడూర్, లక్నాపూర్ గ్రామాల పరిధిలో కొంత ఆలస్యంగా, మిగతా గ్రామాలతో పోలిస్తే సుమారు నెల రోజుల తర్వాత వరి నాట్లు వేస్తారు. దీంతో పంట సైతం ఈ గ్రామాల పరిధిలో నెల ఆలస్యంగా వస్తుంది. ఇటీవల సుల్తాన్‌పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సందర్శించిన సమయంలో రైతులు ఇదే విషయాన్ని తెలియజేశారు. ఈ నాలుగు గ్రామాలలో పంట ఆలస్యంగా వేస్తారని, ధాన్యం మరో నెల రోజుల వరకు వస్తుంటుందని రైతులు చెప్పారు. ప్రస్తుతం మండలంలోని చిగు రాల్‌పల్లి గ్రామ పరిధిలో సుమారు 80 ఎకరాలు, లక్నాపూర్ పరిధిలో సుమారు 100 ఎకరాలకు పైగా, మిట్టకోడూర్ 100 ఎకరాలకు పైగా, గోవిందాపూర్ 50 ఎకరాల వరకు వరి పంట ఉన్నట్లు రైతులు తెలిపారు. ఈ నాలుగు గ్రామాలలో గత నాలుగైదు రోజుల క్రితం వరి కోతలు ప్రారంభించగా, అంతలోనే వర్షాలు రావడంతో కోతలు నిలిచిపోయాయి. గత నాలుగైదు రోజుల క్రితం లక్నాపూర్ పరిధిలో వరి కోత మిషన్‌లతో కోతలు కొనసాగుతుండగా భారీ వర్షం కురిసింది. దీంతో కోతలు నిలిచిపోయి కోత మిషన్‌లను బయటకు తీసుకువచ్చారు. గత నాలుగైదు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షంతో వరికోత మిషన్‌లు పంట పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భూమి నానడంతో వరికోత మిషన్‌లు దిగబడతాయి. అలాగే ప్రతి రోజు ఎంతో కొంత వర్షం కురుస్తుండడం వల్ల పంట పొలాలు పూర్తిగా నాని మెత్తగా మారాయి. పొలం పూర్తిగా ఆరిన తర్వాతే వరికోత మిషన్‌లు వెళ్లే అవకాశం ఉన్నది. మరోవైపు మరో నాలుగైదు రోజుల వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో కోతలు ప్రారంభించాలంటే పొలం ఆరడానికి వారం సమయం పట్టే అవకాశం ఉంటుంది. దీంతో తమ పంట చేతికి వస్తుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతల కోసం నీరు పారబెట్టడం నిలిపివేయగా వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతోపాటు పంటచేను ఒరిగిపోయే అవకాశం ఉందని, తెరిపి లేకుండా వర్షాలు కురిస్తే పంట పొలంలోనే ధాన్యం మొలకెత్తే ప్రమాదముందని రైతులు భయాందోళన చెందుతున్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా వరి కోతలు కేవలం యంత్రాల సహాయంతోనే చేస్తుండడంతో ప్రస్తుత పరిస్థితులలో వాతావరణం అను కూలించక పోవడం వల్ల యంత్రాలు పొలాల్లోకి వెళ్లలేని స్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో వరి కోతలు చివరి దశకు చేరుకున్న చోట గత వారం క్రితం కోతలు చేపట్టిన రైతులు తమ ధాన్యం ఆరబెట్టడానికి వాతావరణం అనుకూలించడం లేదు. ఉదయం, సాయంత్రం లేదంటే రాత్రి సమయంలో వర్షాలు కురుస్తుండడంతో తమ పొలాల వద్ద, గ్రామాలలోని అనువైన స్థలాల్లో ధాన్యం ఆరబెట్టడానికి పోసినా వర్షాల భయంతో కవర్లు తీయలేని స్థితి నెలకొంది. ఉదయం సమ యంలో ఎండ వచ్చిందని ఆరబెడితే మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తుంది. దీంతో కోతలు చేపట్టిన రైతులు ధాన్యం ఆర బెట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు కొనుగోలు కేంద్రాలలో సైతం ధాన్యం బస్తాలు అధికంగా ఉండగా గత రెండు రోజుల నుంచే వాటిని తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిండిపోయి రైతులు కొత్తగా ధాన్యం బస్తాలు తీసుకురాలేని పరిస్థితి ఉండేది. వరుసగా రోజు వర్షాలు కురుస్తున్న నేపథ్యం లో ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

బొంరాస్‌పేట, మే 21: మండల పరిధిలోని కొత్తూరు ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అకస్మిక తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన నాలుగువేల ధాన్యం బస్తాలు ఉన్నాయని వాటిని మిల్లులకు పంపేందుగాను లారీలను పంపించాలని నిర్వాహకులు కోరారు. అందుకు ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలను పంపిస్తామని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల నుండి ధాన్యం కొనుగోలుచేసి ఓపీఎంఎస్ ఎంట్రీ చేయాలన్నారు. ట్రాక్‌షీట్స్ నమోదుచేసి రైతులకు సకాలములో డబ్బులు అందేవిధంగా చేయాలని నిర్వహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయన్న, నిర్వహకులు, రైతులు పాల్గొన్నారు

పరిగి, మే 21 : మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం పరిగిలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ పరిశీలకులు వినోద్‌రెడ్డి, రాంశెట్టి, నరేందర్, స్థానిక నాయకులతో కలిసి రాజీవ్‌గాంధీకి ఎమ్మెల్యే నివాళులర్పించారు. దేశ పురోభివృద్ధికి రాజీవ్‌గాంధీ తనదైన శైలిలో సేవలందించారని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేశారన్నారు.

పామ్ ఆయిల్ సాగుతో అధిక లాభాలు

పట్లూర్ రైతు వేదిక వద్ద రైతులతో శాస్త్రవేత్తలు, అధికారులు

మర్పల్లి, మే 21: పామ్ ఆయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పట్లూర్ రైతు వేదికలో మండల రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, పచ్చిరొట్ట పంటలు వేసి భూసారాన్ని పెంచాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రసీదు తీసుకొని దగ్గర పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్ర వేత్తలు, డాక్టర్ సుజాత, యమునా రెడ్డి, ఏవో శ్రీకాంత్, హార్టికల్చర్ ఆఫీసర్ అక్షితా రెడ్డి, ఏఈవోలు ప్రశాంత్, మహేశ్, నీరజ, సురేవ్ యాదవ్, సురేశ్ కుమార్ యాదవ్, ఎఫ్ఓ శ్రీకాంత్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు..



కులకచర్ల, మే 21 : మండల పరిధిలోని పటేల్‌చెరువుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సదన్ చెరువుతండాలో పాల్తావత్ తులసీరెడ్యానాయక్‌ల కుమార్తె సోనా వివాహానికి ఒక క్వింటాల్ సోనామసూరి సన్నబియ్యం, 15కిలోల మంచినూనెను గ్రామ మాజీ సర్పంచ్ శాంతి తులసీరామ్ అందించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు తులసీరామ్, జగినీబాయ్, సేవ్యానాయక్, చుక్కానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

బొంరాస్‌పేట, మే 21 : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎంపీసీ కుమారస్వామి తెలిపారు. మొదటి, రెండవ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులతోపాటు ఓకేషనల్ గ్రూపులు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు వంటి అనేక సదుపాయలు ఉన్నాయని అన్నారు. కళాశాలలో అడ్మిషన్ల కొరకు 9441162513, 9948486885 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.కార్యక్రమంలో విద్యాధికారి హరిలాల్,అధ్యాపకులు సురేశ్, హరికృష్ణ, నర్సిములు గౌడ్, రాంచంద్రరెడ్డి, స్పెషల్ టీచర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కొడంగల్: స్థానిక కేజీబీవీ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ఎస్‌వో స్రవంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ(తెలుగు మీడియం) అదేవిధంగా పాఠశాలలో 6వ తరగతి ఇంగ్లీష్ మీడియం నందు అడ్మిషన్‌లు అదుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు కళాశాలకు చేరుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9494246958, 8187860659 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కులకచర్ల, మే 21: చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామంలో ఓ ఇంటి దగ్గరకు వచ్చిన జింక ఇంటి గేటుకు ఉన్న గ్రిల్స్‌లో ఇరుక్కోగా గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ అధికారి ఆంజనేయులు అక్కడికి చేరుకొని గ్రిల్స్‌లో నుంచి జింకను కాపాడి మహబూబ్‌నగర్ పిల్లల మర్రికి తరలించారు. జింక ఆరోగ్యంగా ఉందని, ఎలాంటి హానీ జరుగలేదని తెలిపారు.

కొడంగల్, మే 21: బొంరాస్‌పేట మండలంలోని కొత్తూర్ గ్రామంలో బహుజన మహ నీయులు అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, మహాత్మజ్యోతీబాపూలే విగ్రహాల ఆవిష్కరణ జరగనుందని అన్ని ప్రజా సంఘాలు నాయకులు, యువకులు, పెద్ద పెద్ద ఎత్తున తరలి రావాలని కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు, బీసీ సేన జల్లా అధ్యక్షుడు డా. వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, తాలూకా అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు రమేశ్ బాబులు కోరారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో బహుజన మహనీయుల విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ విడుదల చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన మహనీయుల విగ్రహ ఆవిష్కణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకునే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పెద్ద ఎత్తున హాజరై విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ నెంబర్ కే దస్తప్ప, ఎస్ వెంకటేష్, జీ రాము, అంజి వెంకటయ్య, సురేష్, శ్రీనివాస్, మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

ధారూరు,మే 21: ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ధారూరు మండల పరిధిలోని అవుసుపల్లి గ్రామంలో ప్రమీలమ్మ, తన కొడుకు రవిలు 2, సెప్టెంబర్ 2015 రోజున ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన సోమారం సమ్మయ్య, అంతరపు శ్రీనివాస్ తన కొడుకుని తాగడానికి అని చెప్పి బయటకు తీసుకొని వెళ్లి చంపారని పిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేసి కేసు వివరాలను జిల్లా ప్రిన్సిపాల్ సెషన్స్ జడ్జి సున్నం శ్రీనివాస్ రెడ్డి నిందితులు ఎ1 సోమారం సమ్మయ్య, ఎ2 అంతరపు శ్రీనివాస్‌కు జీవి త ఖైదు, జరిమానా విధించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, మే 21 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లి మెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎన్. శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి పరీక్షలను ప్రతి రోజు రెండు విడతలలో నిర్వహిస్తామన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కులకచర్ల, మే 21 : కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో విద్యుత్‌కు గురువారం అంతరాయం జరుగనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో వివిధ మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్‌ను నిలిపివేయ నున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కొడంగల్, మే 21ః విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించే దిశగా ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాందెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో యూపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షణలో ఎఫ్ఎల్ఎన్, లైఫ్ స్కిల్స్, కేపాసిటీ బిల్డింగ్, టీచింగ్ మెథడ్స్, క్వాలిటీ ఎడ్యూకేషన్ వంటి వాటిపై ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు

జనగాం బీరప్ప ఆలయానికి సీసీ రోడ్డు మంజూరు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ధారాసింగ్, నారాయణరెడ్డి

పెద్దేముల్, మే 21 : పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో బీరప్ప ఆలయానికి రూ. 8లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ధారాసింగ్, నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలిపేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శివకుమార్, పెంటన్న, లక్ష్మప్ప, పెద్ద నర్సప్ప, అనంతయ్య, శ్రీను, సంజీద్, దస్తప్ప, వెంకటప్ప, సంగప్ప, పొల్లమోళ్ల నర్సింహులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

యాలాల్, మే21: భూమి విషయంలో కులం పేరుతో దూషించినందుకు కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌ఓ గిరి తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన గట్టు అనిల్ తన భూమి విషయంలో తన వదిన వైపు మాట్లాడుతున్నాడన్న అక్కసుతో కులం పేరుతో దూషించాడని అదే గ్రామానికి చెందిన శంకర్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ గిరి తెలిపారు

ఆగని వాన..

గోధుమగూడ రైల్వే బ్రిడ్జీ కింద నిలిచిన వర్షపునీరు

వికారాబాద్, మే 21: జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుసున్నది. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా తాండూరులో 57.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ వరణ శాఖ అధికారులు తెలిపారు..

జిల్లాలో వర్షపాతం ....

తాండూరు 57.3 మిల్లీమీటర్లు, వికారాబాద్ 43.3, యాలాల 38.3, మర్పల్లి 36.8, బషీరాబాద్ 33.8, కొడంగల్ 31.3, పూడూరు 22.5, బొంరాస్‌పేట 21.0, దోమ 17.8, ధారూరు 15.8, పెద్దేముల్ 13.0, కుల్కచర్ల 10.5, కోట్‌పల్లి 9.0, పరిగి 7.0, బంట్వారం 6.5, దౌల్తాబాద్ 3.0, నవాబుపేట 2.5, చౌడాపూర్ 1.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రాకపోకలకు అంతరాయం..

వికారాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం చిరుజల్లులతో ప్రారంభమై మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పట్టణంలోని రోడ్లన్ని జలమయం అయ్యాయి. రైతు బజార్‌లో కూరగాయలు అమ్మే రైతులు వర్షానికి పలు ఇబ్బందులు పడ్డారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి, కొత్తగడి, గోదుమగూడ రైల్వే బ్రిడ్జీల కింద వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు చేరడంతో ఆ నీరు తగ్గేంత వరకు అక్కడే వేచి ఉండి తగ్గిన తరువాత వారి వారి ఇండ్లకు చేరుకున్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ దిగువ తెలిపిన వాటిని కొనుగోలు చేయదలిచారు: 1) మైలార్‌దేవరపల్లి గ్రామం, వికారాబాద్ మండలం, వికారాబాద్ జిల్లా వద్ద గల, సర్వే నెం.50/3/2లో ఎక.1.00 గుంటలు, సర్వే నెం.50/3/1/1లో ఎక.1.38 గుంటలు మరియు సర్వే నెం.54A2/1/1లో ఎక.0.12 గుంటలు, మొత్తం ఎక.3.10 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తు, **శ్రీ ఎర్రవల్లి రాంరెడ్డి తండ్రి శ్రీ జంగారెడ్డికి** చెందినది. 2) మైలార్‌దేవరపల్లి గ్రామం, వికారాబాద్ మండలం, వికారాబాద్ జిల్లా వద్ద గల, సర్వే నెం.50/5Aలో ఎక.1.38 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తు, **శ్రీ దొడ్ల ధన్‌రెడ్డి తండ్రి శ్రీ భుజంగ రెడ్డికి** చెందినది. 3) మైలార్‌దేవరపల్లి గ్రామం, వికారాబాద్ మండలం, వికారాబాద్ జిల్లా వద్ద గల, సర్వే నెం.50/EEలో ఎక.1.00 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తు, **శ్రీ దొడ్ల గోవింద్ రెడ్డి తండ్రి శ్రీ భుజంగ రెడ్డికి** చెందినది. 4) మైలార్‌దేవరపల్లి గ్రామం, వికారాబాద్ మండలం, వికారాబాద్ జిల్లా వద్ద గల, సర్వే నెం.50/EE/2లో ఎక.1.00 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తు, **శ్రీ ఎర్రవల్లి విమలమ్మ, భర్త శ్రీ ఎర్రవల్లి రాంరెడ్డికి** చెందినది.

ఎవరికైనా పై సదరు విషయానికి సంబంధించి ఏదేని అభ్యంతరం లేదా ఇతర సమాచారం కలిగి ఉన్నచో వారు సదరు ప్రకటన తేదీ నుండి ఏడు (7) రోజులలోగా వ్రాతపూర్వకంగా అభ్యంతరాలను మరియు అన్ని సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారును సంప్రదించవచ్చును, ఎలాంటి అభ్యంతరాలను అందనిచో ఎటువంటి క్లెయిమ్‌లు లేవని భావించబడును మరియు ఆతరువాత అందిన ఏవేని క్లెయిమ్‌లు పరిగణించబడవు. నా క్లయింట్ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్‌తో ముందుకు సాగుతారు.

దేవాకర్.పి, అడ్వకేట్
ప్లాట్ నెం.180/పి, త్రిమూర్తి కాలనీ, రోడ్ నెం.4, మహేంద్ర హిల్స్, సికింద్రాబాద్-500026,
ఫోన్: (0) - 27055585/27716501/27731757/27735558,
మొబైల్ నెం.9849025380.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LEASE REQUIRED

★సంవత్సరం లీజుకు 10 Acres to 15 Acres భూమి కావాలి. కొత్తూరు, షాద్‌నగర్, తిమ్మాపూర్ పరిసర ప్రాంతాలవారు 15 సంవత్సరాలు సంప్రదించండి: 9182757179
NT-342957

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

పేరు మార్పు

★ముడావత్ బాల్య నాయక్, తండ్రి: ముడావత్ హేమ్లా నాయక్, R/o. 1-36, బాపల్లి తండా గ్రామం, గౌరారం, బొంరాస్‌పేట మండలం, వికారాబాద్ జిల్లా, తెలంగాణ అను నేను నా పేరును ముడావత్ బాలుగా మార్చుకున్నాను.
NT-Vamshi

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962